బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక కేజీబీవి కళాశాలలో బుధవారం బాల్య వివాహల నిరోధిత చట్టంపై విద్యార్థినిలకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ అధికారిని సూర్య కుమారి మాట్లాడుతూ, బడి ఈడు బాలికలందరు చదువుకుని భవిష్యత్తుకు మార్గాలు చూసుకోవాలన్నారు. ప్రభుత్వం బడి ఈడు పిల్లలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ మాట్లాడుతూ, పోలీసుల చట్టాలపై వివరించారు. స్థానిక వైద్యాధికారి నిఖిల్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేసుకోవడంతో శారీరకంగా పలు అనర్థాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు అధికారి

తగ్గుముఖం పట్టిన వరద.. వీడని ముంపు

జల దిగ్బంధనంలోనే పలు గ్రామాలు

వరద ముంపులోనే ఉన్న విఆర్.పురం మండలం వడ్డిగూడెం గ్రామం

ప్రజాశక్తి-ఎటపాక

భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి, శబరి నదుల వరద ఉధృతి తగ్గుతూ వస్తోంది. అయినా ఇంకా పలు గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. గోదావరి నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 44 అడుగులకు చేరుకుంది. ఎటపాక మండలం మురుమూరు గ్రామానికి గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ- మురుమూరు మధ్య బోట్ ఏర్పాటు చేసినప్పటికీ డీజిల్ లేదని గ్రామస్తులు ఆరోపించారు. పలుమార్లు అధికారులకు ఫోన్ చేసిన స్పందించడం లేదని, అధికారులు బాధ్యతరాహితంగా వ్యవహరిస్తున్నారని, అత్యవసర పరిస్థితి అయినా ఇంతేనా అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టిడిపి నాయకులు పెనుబల్లి సాయిబాబు బోట్లో మురుమూరు గ్రామానికి చేరుకొని వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని గ్రామస్తులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

చింతూరు : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం ఉదయం క్రమంగా తగ్గుతూ 45.5 అడుగులకు చేరడంతో రెండవ ప్రమాదక హెచ్చరిక అధికారులు ఉపసంహరించారు. చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం 38 అడుగులకు తగ్గింది. దీంతో చింతూరు ప్రజలు కొంతమేర ఉపశమనం పొందారు. చింతూరు నుండి ఒడిస్సాకు వెళ్లే కల్లేరు వద్ద రహదారి కోతకు గురి కావడంతో ఒడిస్సా ఆంధ్ర రవాణా సౌకర్యం నిలిచిపోయింది.

విఆర్.పురం : విఆర్.పురం మండలంలోని శబరి, గోదావరి సంగమంలో వరద స్వల్పంగా తగ్గుతూ ఉంది. అయితే వరద ముంపునకు గురైన గ్రామాల్లో ఇంకా వరద నీరు తగ్గలేదు. బాధితులు పునరావాహస కేంద్రాల్లోనే ఉన్నారు. వరద పూరిగా తగ్గకపోవడంతో తమ గృహాలు ఎలా ఉన్నాయో అని ఆందోళన చెందుతున్న బాధితులు బుధవారం వడ్డిగూడెం గ్రామానికి చెందిన వారు బోటులో వెళ్లి గ్రామాన్ని చూసుకొని వచ్చారు. రహదారుల మీదకి వచ్చిన వరద ఇంకా తగ్గకపోవడంతో వెళ్ళడానికి అవకాశం లేక పడవలకు డబ్బులు ఇచ్చి వెళ్లి చూసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో అందని కనీస సౌకర్యాలు

పునరావాస కేంద్రాల్లో మంచినీరు, పిల్లలకు పాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట కరెంటు లేక పిల్లలతో ఇబ్బంది పడుతున్నామని, ఏ విష పురుగు వస్తుందేమోనని భయంతో ఉంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు

కూనవరం : కొన్ని రోజులుగా భారీ వర్షాలు, వరదలు కారణంగా కరెంటు లేకపోవడంతో మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు మంచినీళ్లకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో పెద్ద ఆర్కూర్ సర్పంచ్ నాగమణి చొరవ తీసుకొని ట్రాక్టర్లతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయించి రేపాక, ఇతర గ్రామాలకు మంచినీటి సదుపాయం కల్పించారు.

ఎటపాక మండలం మురుమూరు -నందిగామ బ్రిడ్జిపై నుండి ప్రవహిస్తున్న వరద నీరు

బరకాలు పంపిణీ

విఆర్.పురం : మండలంలో రేఖపల్లి పంచాయితీ పరిధి అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల్లో వరద బాధితులకు బరకాలను జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్, పూనం సరోజిని, సిపిఎం, టిడిపి నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనం సత్యానారాయణ, కుంజ కన్నయ్య, సోడి మల్లయ్య, టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నా రావు, జనసేన నాయకులు ములకాల సాయికృష్ణ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లకు భోజనాలు

చింతూరు : జెకెసి ట్రస్టు ఆధ్వర్యాన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ బుధవారం లారీ డ్రైవర్లకు భోజనాలు అందించారు. నాలుగు రోజులుగా జాతీయ రహదారిపై వందలాది లారీలు నిలిచిపోవడంతో డ్రైవర్లు, క్లీనర్లు ఆహారం లేక అలమటిస్తున్నారని గ్రహించి జమాల్ఖాన్ భోజనం వండించి చట్టి జాతీయ రహదారి జంక్షన్లో సుమారు 150 మందికి భోజనాలు అందించారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్, రియాజ్, అజీజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాల సహాయం : కలెక్టర్ దినేష్కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

ముంపు బాధితులకు అన్ని విధాల సహాయం చేస్తామని, భయపడ వద్దని, ధైర్యం ఉండాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని జీడిగుప్ప పంచాయతీ పరిధి జీడిగుప్ప, ములకనపల్లి గ్రామాలను, కొండగుట్టల్లో ఏర్పాటు చేసుకున్న పునరావాస కేంద్రాలను సందర్శించారు. వరద బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని కుటుంబాలకు ఉల్లిపాయలు, బంగాళదుంపలు, కూరగాయలు నూనె ప్యాకెట్లు అందజేశారు. రాత్రి వేళలో ఇబ్బంది పడుతున్నామని, దోమ తెరలు, కిరోసిన్, బరకాలు అందజేయాలని కలెక్టర్ని బాధితులు కోరారు. కలెక్టర్ వెంట రంపచోడవరం ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, విఆర్ పురం తహాశీల్దారు, కూనవరం సీఐ, అధికారులు ఉన్నారు.

తమ గ్రామ పరిస్థితి చూడటానికి పడవపై వెళ్తున్న వడ్డి గూడెం గ్రామస్తులు

రేఖపల్లి పంచాయతీలో బరకాలు అందిస్తున్న జెడ్పిటిసి, సర్పంచ్

జీడిగుప్ప పంచాయతీలో పర్యటిస్తున్న కలెక్టర్ దినేష్కుమార్

బియ్యం అందిస్తున్న కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

ముంపు బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కూనవరం : వరద ప్రభావిత ప్రాంతాల్లో బియ్యం, నిత్యావసరాలు పంపిణీ కార్యక్రమాన్ని వేగం చేశారు. మండలంలోని అభిచర్ల గ్రామంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య గ్రామ ప్రజలకు వరద బియ్యాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోదావరి వచ్చి మూడు రోజులైనా బొజ్జరాయి గూడెం నుండి కోడేరు గ్రామానికి పడవ పెట్టకపోవడం వల్ల తాళ్లగూడెం, రాయి గూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచాయని తెలిపారు. పడవ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేసినా స్పందించలేదన్నారు. వచ్చిన వరద బియ్యాన్ని రేగులపాడు, కోడేరు ప్రజలు ఎలా తెచ్చుకుంటారని ప్రశ్నించారు. కొత్తగా పెళ్ళైన యువతీ యువకులకు వరద బియ్యం అందించడం డిమాండ్ చేశారు.

విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ పరిధి అడవి వెంకన్న గూడెం, సోముల గూడెం, రామవరం, చొప్పల్లి, గ్రామాల్లో ముంపు బాధితులకు 650 బరకాలను, రేషన్ కార్డుకి కేజీ కందిపప్పు చొప్పున ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం నాయకుల చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. పెద్దమట్ట పల్లి పంచాయతీ పరిధిలోని గుర్రం పేటలో వరద బాధితులకు 185 కుటుంబలకు బరకాలను స్థానిక ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో గుడారాలు వేసుకొని కరెంటు, తాగునీరు లేక దోమలతో ఇబ్బంది పడుతున్నారని, ఎటు నుంచి విష పురుగులు వస్తాయోనని భయంతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం వారికి కిరోసిన్, నిత్యవసర సరుకులు, సోలార్ లాంతర్లు, దోమ తెరలు పంపిణీ చేయాలని, హెల్త్ క్యాంపులు పెట్టాలని, పిల్లలకు పాల ప్యాకెట్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య, వడ్లాది రమేష్, సుదీర్, రామవరం సెక్రటరీ తాతారావు, పెద్దమటపల్లి సెక్రెటరీ రామారావు పాల్గొన్నారు.

కొండలపై ఉన్న వారికి అందని నిత్యావసరాలు

మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కనపల్లి ఎస్టి గుంపు వాసులు కొండలపై పాకలు వేసుకొని నివాసమున్నారని, వారికి ఇంతవరకు నిత్యవసర సరుకులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా మేము నీళ్ల లేక, తినడానికి తిండి లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ అధికారులతో మాట్లాడి బుధవారం నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి బోటు సహాయం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొంది. దారయ్య, విఆర్ఓ రమాదేవి, తోడం రాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు పంపిణీ చేస్తున్న శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్కుమార్ తదితరులు

సికిల్ సెల్ ఎనీమియాతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: డుంబ్రిగూడ మండలం సొవ్వ దేముడువలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి మాచ్ లాజర్(12) సికిల్ సెల్ ఎనిమియా వ్యాధితో అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విద్యార్థి డుంబ్రిగూడ మండలం గసభ పంచాయితి గసభ గ్రామం. అనారోగ్యం బాగో లేపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మంగళవారం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చి చేర్పించారు. చికిత్స పొందుతున్న బుదవారం చని పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.రామారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ పరిదిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో అనేక మంది సికిల్ సెల్ ఎనిమియాతో ఇబ్బందులు పడుతూన్నారని తెలిపారు. ఈ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక మెనూ ఏర్పాటు చేసి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. సరైన పౌష్టిక ఆహారం అందక రక్తహీనత సమస్యతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.అన్ని ఆశ్రమ పాఠశాల, కళాశాలలో తాగడానికి వేడి నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలో గతంతో పని చేసిన హెల్త్ వాలంటీర్లను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఐటిడిఏ)ద్వారా ఆదివాసి గిరిజన బిడ్డలకు సరైన సదుపాయం ఇచ్చిన పరిస్థితి లేదని, వెంటనే ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఐటిడిఏ అధికారులు, ప్రభుత్వం స్పందించాలన్నారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన విద్యార్థి

కేంద్ర బడ్జెట్ కేటాయింపులో ఆదివాసీలకు అన్యాయం

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో మాటలు తప్ప నిధుల కేటాయింపులు లేవని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనరస విమర్శించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆర్థికమంత్రి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించారని, చెప్పిన మాటల్లో కూడా స్పష్టత లేదన్నారు. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనడంతో రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదన్నారు. 15 వేల కోట్ల రూపాయలు నేరుగా గ్రాంటుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడంతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదన్నారు. పోలవరానికి 12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా బడ్జెట్లో స్పందన లేదన్నారు నిర్వాసితుల్ని గాలికొదిలేశారన్నారు. ప్రత్యేక హెూదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్లో ప్రస్తావించలేదన్నారు. పుణ్యక్షేత్రాల టూరిజం, వరద నివారణ చర్యలు తదితర విషయాల్లో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా, తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదన్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపైనా, బిజెపిపైనా రాజకీయంగా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

సిసిఎం, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

కార్మికులను నిరాశే :సిఐటియు

అరకులోయ రూరల్: కేంద్ర బడ్జెట్లో చిరు ఉద్యోగులను, కార్మికులను నిరాశ కలిగించిందని, జాతీయ ఆరోగ్య మిషన్, ఐసిడిఎస్, సర్వ శిక్ష అభియాన్, మధ్యాహ్న భోజనం, ఆయుష్మాన్ భారత్ ,తదితర కేంద్ర పథకాలకు కేటాయింపులు లేవని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ,2022-2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధికి ఖర్చు చేసిన మొత్తం కంటే ఈ బడ్జెట్లో చేసిన కేటాయింపులు తక్కువగా ఉందని, ఇలా అయితే ఉపాధి ఎక్కడ పెరుగుతుందని ప్రశ్నించారు. సంపన్నులు కట్టే ప్రత్యక్ష పన్నుల్లో వేల కోట్లు రాయితీలు ప్రకటించిందని, సామాన్య ప్రజలకు మొండి చెయ్యి చూపించిందన్నారు. కార్మికులకు సంక్షేమం, కనీస వేతనాలు, ఇతర సమస్యలపై స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.

అరకులోయ రూరల్: కేంద్ర బడ్జెట్లో ఆదివాసీలకు 13,000 కోట్లు కేటాయించామని గత బడ్జెట్ కన్నా 4.31 శాతం అధికమని కేంద్ర గిరిజన మంత్రి అంకెల గారడీతో ఆదివాసులకు మోసగించారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అన్నారు. బుదవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,కేంద్ర బడ్జెట్ కేటాయింపులో ఆదివాసీల జనాభ ప్రాతిపదికన 8.3 శాతం కేటాయింపులు ఉండాల్సి ఉండగా ఆ విధంగా చేయలేదన్నారు. గత సంవత్సర బడ్జెట్లో (పీవిటిజి) ఆదివాసీలకు జన్మన్ అభియాన్ పథకంలో కేటాయించిన 24 వేల కోట్లు కేటాయింపులు చేశారని, ఆ పథకంలో నిర్మించిన ఇళ్లులు, మౌలిక వసతుల కోసం నేటికీ నిధులు విడుదల చేయలేదని తెలిపారు. ఆదివాసీ గ్రామాల్లో రోడ్లు లేక డోలి మోతలే శరణ్యమవుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 25 వేల ఇల్లులు మంజూరు చేసినా నేటికీ నిధులు మధ్యలో నిలిచి పోయాయని పేర్కొన్నారు.మౌలిక వసతులైన సీసీ రోడ్లు, మంచినీరు, గ్యాస్, విద్యుత్ విద్య, వైద్యం పారిశుధ్యం మెరుగు పరచడానికి, స్థిరమైన జీవన అభివద్ధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశంగా గత నవంబర్ 15న దేశవ్యాప్తంగా 100 ఆదివాసీ జిల్లాల్లో ప్రధాని వర్చువల్ విధానంలో అల్లూరి జిల్లా అరకులోయ మండలం కొత్త బల్లుగుడ గ్రామంలో ప్రారంభించారన్నారు. ఆదివాసీ ప్రాంతంలో విద్య, వైద్య సదుపాయాలు లేని కారణంగా అనేక మంది ఆదివాసీలు అనారోగ్యంతో మరణి స్తున్నారన్నారు. బిజెపి పాలనలో గిరిజన యూనిర్సిటీకి నిధులు కేటాయింపులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీలు పార్లమెంటులో పోరాడాలని డిమాండ్ చేశారు.

శంకుస్థాపనతో సరి

-పదేళ్లుగా ముందుకు సాగని పనులు
-ఇదీ అంజలి శనివారం రహదారి దుస్థితి

ప్రజాశక్తి-చింతపల్లి:: మండలంలోని అంజలి శనివారం రహదారి శంకుస్థాపనలకే పరిమితమైంది. ఈ పదేళ్ల కాలంలో ఈ రహదారి నిర్మాణానికి నాలుగు సార్లు శంకుస్థాపనలు చేశారంటే ఎవరైనా ఆశ్చర్య పోవాల్సిందే. జాజులపాలెం నుండి అంజలి శనివారం వరకు సుమారు 2 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన ఈ రహదారి నిర్మాణ పనులను 10 ఏళ్ల క్రితం అప్పటి ఎంపి కొత్తపల్లి గీత లాంఛనంగా ప్రారంభించారు. "దేవుడు కరుణించినా పూజారి బిక్షమెట్టలేదు" అన్న చందంగా అప్పుడు కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆ పనులను ఆదిలోనే నిలిపి వేశాడు. ఆ తరువాత అదే రహదారికి 2018లో అప్పటి ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయినప్పటికీ రహదారి నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మొన్నటి ప్రభుత్వ హయంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆ రహదారి నిర్మాణ పనులకు మరలా శంకుస్థాపన చేశారు. ఆ తరువాత జెట్పిటీసీ పోతురాజు బాలయ్య, ఎంపిపి కోరాబు అనూషదేవి, స్థానిక సర్పంచ్ పేట్ల రాజుబాబుతో కలిసి మరో మారు శంకుస్థాపన చేశారు. ఇలా నాలుగు సార్లు శంకుస్థాపనలు జరిగిన రహదారి ఏదైనా ఉందంటే అది అంజలి శనివారం రహదారి మాత్రమే. ప్రస్తుతం రాష్టంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటికైనా పూర్తి చేస్తారా? లేక మరలా కొత్తగా శంకుస్థాపన చేసి మొదలు పెడతారా అన్న సందేహం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేస్తున్న నాయకులు (ఫైల్ ఫొటో)

అస్తవ్యస్తంగా ఉన్న అంజలి శనివారం రోడ్డు

శిలాఫలకం

చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు

రహదారిపై కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి -చింతపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అల్లూరి జిల్లాలో సుమారు రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా మన్యప్రాంత రహదారులకు అడ్డంగా భారీ వృక్షాలు నేల కూలుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున కొర్రుబయలు నుంచి లంబసింగి మీదుగా తాజంగి వెళ్లే ప్రధాన రహదారి రూథర్ ఫర్డ్ అతిథి గృహం సూచిక బోర్డు వద్ద భారీ వృక్షం నేల కూలడంతో కొర్రుబయల నుంచి లంబసింగి, తాజంగి రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ రహదారి గుండా ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులు చింతపల్లి ఎస్సై అరుణ్ కిరణ్కు సమాచారం అందించారు. స్పందించిన ఆయన ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ గెమ్మేలి న్యాసిరావు పోలీస్ సిబ్బందితో రహదారికి అడ్డంగా పడిన చెట్టును జెసిబి సహాయంతో తొలగించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీస్ సిబ్బంది వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టడంపై వాహన చోదకులు, ప్రయాణికులు, ఆయా ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పాఠశాలలకు సెలవు

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:జిల్లాలో కురుస్తున్న వర్షాలు ఇంకా తగ్గుముఖం పట్టనందున ఈనెల 25వ తేదీన కూడా అన్ని యాజమాన్య పాఠశాలలకు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ సెలవు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు సెలవు అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులను తల్లిదండ్రులు బయటకు పంపించకూడదని, ప్రజలు గెడ్డలు, వాగులు దాటి ప్రయాణించ కూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని పేర్కొన్నారు.

ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చింతపల్లి:చింతపల్లి మేజర్ పంచాయతీలోని చిన్నగెడ్డ సచివాలయం-2లో ఈనెల 26, 27 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించే తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని సచివాలయ పరిధి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల జనసేన ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి(పండు) కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఆధార్ అప్డేట్‌లపై అవగాహన లేక అనేక మంది నిరక్షరాస్యులైన గిరిజనులు వివిధ ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు.ఆధార్ కు ఫోన్ నెంబర్ అనుసంధానం లేక నిరుపేద గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు.ఆధార్‌లో తప్పొప్పులు, అప్డేట్, ఇతర సేవలకు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు నైపుణ్యాలతో రాణించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విద్యార్థులు చదువుతోపాటు స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, మంచి మాటతీరు, నడవడికతో బంగారు భవిష్యత్తు ఏర్పాటుచేసుకోవాలని సాహితీ సభ్యులు, కవి, రచయిత బొడ్డు కూర్మారావు సూచించారు. కంచరపాలెంలోని గవర్నమెంట్ గర్ల్స్ ఐటిఐలో సాహితీ స్రవంతి, లయన్స్ క్లబ్ ద్వారక నగర్ నిర్వహించిన 'చదువులో నైపుణ్యాలు అంతం' పై బుధవారం మాటల పోటీ నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ జివి.రమణ , లయన్స్ క్లబ్ ద్వారకా నగర్ అధ్యక్షులు పిజి.లక్ష్మీనారాయణ, సత్య ప్రసాద్ తేజ, ఐటిఐ ట్రైనింగ్ ఆఫీసర్ కె.శంకరరావు, బి.శ్రీనివాసరావు, కె.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

కార్యాలయంలోని విభాగాలను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్

సాంకేతికవిభాగంపై వీఎంఆర్‌డిఎ కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : వీఎంఆర్‌డిఎలోని సాంకేతిక విభాగం పనితీరుపై కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, బుధవారం సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను చేపట్టాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు. తదుపరి ఉద్యోగభవన్‌లోని అన్ని అంతస్తులు తిరిగి భవన స్థితిగతులను అడిగితెలుసుకున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-గొలుగొండ : సిసిఆర్సి కార్డులతో కౌలు రైతులకు పంటపై హక్కులు ఉంటాయని డిప్యూటీ తహసీల్దార్ భరత్, మండల వ్యవసాయాధికారిణి సుధారాణి తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, పంటకు రుణాలు వంటివి కౌలు రైతులకు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం సిసిఆర్సీ కార్డులు వీఆర్వో లాగిన్లో పొందడానికి అవకాశం ఇచ్చారన్నారు.

వరద నష్టాలపై సమాచారం సేకరించండి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా వ్యాప్తంగా వరద ప్రభావిత గ్రామాలలో జరిగిన నష్టాలపై పూర్తి సమాచారం సేకరించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. అధికారులు గుర్తించిన బాధితులకు పూర్తి స్థాయిలో నిత్యావసర సరుకులు అందించాలని చెప్పారు. బుధవారం ఆయన కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూం నుండి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రణాళిక బద్ధంగా ఈనెల 25 నాటికి పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. కూనవరం వెళుతున్న రోడ్డు తెగిపోయిందని అది మినహా మిగిలిన అన్ని రోడ్లు వినియోగంలోకి వచ్చాయని ట్రాక్టర్లు పెట్టుకుని అన్ని గ్రామాలకు సరుకులు చేరవేసి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. బాధితులు దోమతెరలు అడుగుతున్నారని, కాకినాడ, విశాఖపట్నం నుండి సేకరిస్తున్నామని రావడానికి రెండు రోజులు పడుతుందని వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు. 10 వేల లీటర్ల పాలకు ఇండెంట్ పెట్టారన్నారు. కిరోసిన్ను అందించాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా తాగునీటి సరఫరా చేయాలని చెప్పారు. అరకొరగా మంచి నీటి సరఫరా చేస్తే సమస్యలు వస్తామని పేర్కొన్నారు. మంచినీటిని వేడి చేసుకుని వినియోగించాలని, దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ

కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్

ఇంటికి 10 క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని, మంచినీటిలో క్లోరిన్ మాత్రలు కలుపుకుని తాగడం పై అవగాహన కల్పించాలన్నారు. నిత్యావసర సరుకులు, డీజిల్, కిరోసిన్, పెట్రోల్ దుర్వినియోగం జరగకుండా అధికారుల పర్య వేక్షణ ఉండాలన్నారు. కొంత మందికి ఇస్తున్నారు, కొంత మందికి ఇవ్వడం లేదనే మాట రాకూడదని తెలిపారు. బియ్యం అందరికి పారదర్శకంగా పంపిణీ చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల విషజ్వరాలు నమోదవుతున్నాయని వైద్య సిబ్బంది మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యాధికారులు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. రానున్న 12 గంటల్లో గోదావరి వరద ప్రవాహం తగ్గ ముఖం పడుతుందన్నారు. ఈ టెలి కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్, రంపచోడవరం, పాడేరు, చింతూరు ఐటిడిఎ పి ప్రాజెక్టు అధికారులు సూరజ్ గనోరే, వి.అభిషేక్, కావూరి చైతన్య, తహశీల్దారులు, ఎంపిడి ఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అందుబాటులో ఉండాలి : ఎంపిపి

మాట్లాడుతున్న ఎంపిపి అనూష దేవి

ప్రజాశక్తి-చింతపల్లి : అల్పపీడన ప్రభావంతో మన్య ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సచివాలయ, వైద్య శాఖ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి కోరారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఈ వర్షాల ప్రభావంతో వాగులు, వంకలు పొంగి పొర్లడమే గాక పంట పొలాలన్నీ జలమయమై రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు.ఇటువంటి పరిస్థితులలో వ్యవసాయ శాఖ అధికారులు గిరి రైతులకు తగు సూచనలు, సలహాలు చేయవలసిన అవసరం ఉందన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన గృహాలు, పంట నష్టాలపై సంబంధిత శాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని ఆమె సూచించారు. వర్షపు నీరు నిలిచి ఉన్న ప్రదేశాలలో దోమల నివారణకు గంబుషియా చేపలను వదలాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడిగా ఉన్న పదార్థాలను మాత్రమే భుజించాలని సూచించారు. ఈ సమావేశంలో జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లిలు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-పాడేరు:పది రోజుల నుండి ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఆదివాసి ప్రాంతంలో అనేకమంది ఆదివాసుల ఇల్లులు కూలిపోయి పంటలు పూర్తిగా నష్టపోయిన ఆ గ్రామాలకు పర్యటించి నష్టం అంచనా వేయాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ: పెదబయలు మండలం కుంతర్ల పంచాయతీ బర్రె మామిడి తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించామని తెలిపారు. బర్రె మామిడి గ్రామంలో కించాయి సింహాచలం ఇల్లు సగం కూలిపోయిందన్నారు. ముంచంగి రాజుబాబు తండ్రి బోంజుబాబు ఇంటి సగం గోడ కూలిపోయిందని తెలిపారు. అధికారులు పర్యటించి ఇల్లులు కూలి పోయి పంట నష్టం కలిగిన రైతులకు తక్షణమే ఆదుకొని నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వంతల బాలంనాయుడు, సిరగం రమణదోర, కించాయి సింహాచలం, పూటి రాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వైద్యశిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి పాడేరు: గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె. రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని, జూనియర్ కళాశాల చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం పున ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చాలా హాస్టల్లో పాతబడిన వాటి స్థానంలో నూతన భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు ట్యూటర్లుగా ఉంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఒక సంవత్సరం నుంచి జీతాలు చెల్లించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు దానియేలు, అనిత, శ్రీదేవి పాల్గొన్నారు.

వర్క్ షాపులో పాల్గొన్న విద్యార్థులు

శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చెయ్యాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శీతోష్ణస్థితి వేడెక్కకుండా యువత కృషి చెయ్యాలని భారత ప్రజారోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎంవివి మురళీ మోహన్ కోరారు. బుధవారం ఉదయం ఎంవిపి కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో ఒడిశాకు చెందిన వ్యూస్ సంస్థ నేతృత్వంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సహకారంతో క్లైమేట్ యూత్ అవేర్‌నెస్ వర్క్ షాప్ నిర్వహించారు. ఔషధ వనంలో మొక్కలు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా, ఒత్తిడికి దూరంగా జీవించాలంటే ప్రకృతి ఆధారిత పంటలు పండించిన ఆహారాన్నే ఆరగించాలన్నారు. ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టి భూగర్భంలోనికి ఇంకేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు, జివిఎంసి సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్ ప్రతినిధి వివేక్, పర్యావరణ వేత్త హేమలత, టీచింగ్ ఫ్యాకల్టీ రాజా ప్రవీణ, కోటేశ్వరరావు, వ్యూస్ సంస్థ కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, ఎస్ఆర్‌యు జివిఎంసి ప్రతినిధి దివ్య, పర్యావరణ కన్సల్టెంట్ జెవి రత్నం, పలువురు విద్యార్థులు మాట్లాడారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యాన మద్దిలపాలెం ఆర్‌టిసి డిపోలో బుధవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భద్రత, కుటుంబం భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులు హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరిగా పాటించాలని డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎంవి.శేషమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ వల్లభనాయుడు, ఆర్‌టిసి డిప్యూటీ సిటిఎం జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 4వ జోన్‌లో 30న వేలంపాట

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసి 4వ జోన్ పరిధిలో డైక్స్‌ట్యాంక్, జగదాంబ, పాత బస్ స్టాండ్ ఫేజ్-2, పద్మనగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్య సముదాయాలలో పలు దుకాణాలకు, అంబేద్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్లు, ఎస్‌విపి (పూర్ణ) మార్కెట్ ఆశీల కోసం ఈ నెల 30న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ పివివిడి.ప్రసాదరావు బుధవారం తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి గుత్తకిచ్చుటకు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు సూర్యాబాగ్‌లోని 4వ జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంపాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సంబంధిత జోనల్ కార్యాలయం పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌జిఒలు భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌జిఒలు సహకరించాలని, వ్యాధులు ప్రబలకుండా తీసుకునే చర్యల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆయా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లాలో పలు రకాల చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశామని కలెక్టర్ వారికి వివరించారు. జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని, అటు ప్రజలకు, ఇటు అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరారైన ఆశ్రమ విద్యార్థుల ఆచూకీ లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి - అడ్డతీగల :అడ్డతీగల మండలం డి.భీమవరం ఆశ్రమ పాఠశాల నుండి మంగళవారం సాయంత్రం పరారైన ఇద్దరు విద్యార్థులను బుధవారం పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని కవులపాలెం గ్రామానికి చెందిన ముర్ల రామారెడ్డి, ముర్ల లక్ష్మారెడ్డి ఇద్దరు కవల పిల్లలు డి.భీమవరం ఆశ్రమ పాఠశాల ఆరో తరగతి చదువుతున్నారు. వీరు ఇద్దరూ మంగళవారం సాయంత్రం భోజనం చేయటానికి ప్లేట్లు తీసుకుని, భోజనం చేయకుండా హాస్టల్ నుండి వెళ్లిపోయారు. అదే పాఠశాలలో చదువుతున్న వారి అన్నయ్య ఇద్దరు తమ్ముళ్లు కనిపించకపోవడంతో వాచ్‌మ్యాన్‌కు తెలియజేశారు. వాచ్‌మ్యాన్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు ప్రజాశక్తి విలేకరి సహకారంతో సీఐ రవికుమార్, ఎస్ఐ అప్పలరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లు రాంబాబు, దుర్గాప్రసాద్, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు రాత్రి ఒంటిగంట వరకు వాగుల వెంబడి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం 5 గంటల నుండి గాలిస్తుండగా, డొక్కపాలెం గ్రామంలో సమీప బంధువుల ఇంటి దగ్గర కానిస్టేబుల్ దేవుడుకు ఇద్దరు పిల్లలు కనిపించారు. దీంతో వారిని సీఐ రవికుమార్, ఎస్సై అప్పలరాజు, తహశీల్దారు నాగమణి, వీఆర్వో సూరమ్మ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు పట్ల మరింత శ్రద్ధ వహించాలని, చిన్న పిల్లలు వారి తల్లిదండ్రులు వచ్చినప్పుడు వారిని మరింత జాగ్రత్తగా చూసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు వారికి సూచించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన విద్యార్థులు

ఘాట్ రోడ్డులో ఢీకొన్న జీపు, బస్సు

జీపు, బస్సు ఢీకొట్టడంతో ఘాట్‌రోడ్డు రాకపోకలకుఅంతరాయం

ప్రజాశక్తి-సీలేరు :జికె.వీధి మండలం ధారాలమ్మ ఘాట్ రోడ్‌లో బుధవారం ఉదయం అనకాపల్లి నుంచి సీలేరు వస్తున్న ఆర్టీసీ బస్సు, దారకొండ నుంచి ఎదురుగా వెళ్తున్న ప్రైవేటు జీపు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రహదారికి ఇరువైపులా తుప్పలు దట్టంగా పెరిగిపోవడంతో వచ్చే పోయిన వాహనాలు కనిపించపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. జీపు, బస్సు సడన్‌గా రావడంతో రహదారి పక్కకు జరగడానికి తుప్పలు అడ్డంగా ఉండడం, లోయ కూడా ఉండడంతో అవి ఢీకొన్నాయి.

ఈ సంఘటనలో జీపు ముందు చక్రం బస్సు కిందకు ఇరుక్కుపోయింది. లేకుంటే రెండు వాహనాలు లోయలో పడి పెను ప్రమాదం సంభవించి ఉండేది. ఇప్పటికైనా చింతపల్లి సబ్ డివిజనల్ ఆర్ అండ్ బి అధికారులు స్పందించి దారకొండ ఘాట్ రోడ్డు ప్రధాన రహదారిలో రవాణా సౌకర్యానికి అంతరాయం లేకుండా రోడ్డుకు ఇరువైపులో ఉన్న తుప్పలు తొలగించాలని, వాహన చోదకులు కోరుతున్నారు.

నీటిమట్టం పెరిగితే దిగువకు విడుదల

ప్రజాశక్తి-సీలేరు:సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయంలో 1036 అడుగులకు నీటిమట్టం చేరుకుంటే బుధవారం రాత్రి తొమ్మిది, పది గంటల సమయంలో రెండు గేట్లు నుంచి దిగు ప్రాంతానికి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఎపి జెన్కో డొంకరాయి ఈఈ పి.విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ డొంకరాయి జలాశయం సామర్థ్యం 1037 అడుగులు కాగా ప్రస్తుతం 1035 అడుగులకి నీటిమట్టలు చేరుకున్నాయని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా వలస గెడ్డ, పాలగెడ్డ, సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలై నీరు ఇన్‌ఫ్లో 8000 క్యూసెక్కుల వరకు డొంకరాయి జలాశయంలో వరదనీరు చేరుతుందని తెలిపారు. బుధవారం రాత్రి తొమ్మిది పది గంటలకు 1036 అడుగులకు నీటిమట్టం చేరుకోగానే డ్యాం రెండు గేట్లు ఎత్తి దిగు ప్రాంతానికి నీటిని విడుదల చేయడానికి ముందస్తు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిరాటకంగా జరుగుతుందన్నారు.

నిండుకుండలా ఉన్న డొంకరాయి జలాశయం

గుంటవాడ జలాశయంలో పెరుగుతున్న నీటి మట్టం

సీలేరు కాంప్లెక్స్ పరిధి గుంటవాడ జలాశయంలో రోజురోజుకీ నీటిమట్టం పెరుగుతుందని ఏపీజెన్కో ఈఈ ప్రభాకర్ వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటవాడ జలాశయం సామర్థ్యం 1360 అడుగులు కాగా మంగళవారం నాటికి 1358.2 అడుగులకు చేరుకుందని, తాజాగా బుధవారం సాయంత్రం 4 గంటలకు 1335.4 అడుగులకు నీటిమట్టం చేరిందని తెలిపారు. పిల్లి గెడ్డ, ఐస్ గెడ్డ, వాగులు వంకలు నుంచి ఇన్‌ఫ్లో తగ్గిందన్నారు. ప్రస్తుతం 1500 నుంచి 2000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో గుంటవాడ జలాశయంలో వచ్చి చేరుతుందని, గత రెండు మూడు రోజులతో పోల్చుకుంటే తగ్గిందని పేర్కొన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిరాటకంగా కొనసాగుతుందని, ఈ క్రమంలోనే మెయిన్ డాం గేట్లు ఎత్తి దిగు ప్రాంతానికి నీటి విడుదల చేసే అవసరం ఉండకపోవచ్చన్నారు.

జనరేటర్ సాయంతో తాగునీటి సరఫరా

జనరేటర్ సాయంతో తాగునీరు అందిస్తున్న ఎంపిడిఒ , సర్పంచ్, అధికారులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు బుధవారం జనరేటర్ సహాయంతో నీటిని సరఫరా చేశారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలుచోట్ల వృక్షాలు పడి కరెంటు సరఫరా నిలిపివేయడం జరిగింది. ఈ క్రమంలో పుల్లంగి పంచాయతీ పరిధిలోని పుల్లంగి, అద్దరివలస, ఆకుమామిడి కోట గ్రామాలకు విద్యుత్ సరఫరా లేక పంచాయతీ ప్రజలు నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా గ్రామాల వారు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ సర్పంచ్ వి జార్జి బాబు బుధవారం మండల అధికారికి ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన ఎంపీడీవో ఏ.వీర కిషోర్ జనరేటర్ సహాయంతో పుల్లంగి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు, పాఠశాలలకు నీటి సరఫరా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జార్జి బాబు, ఈవోపీఆర్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్, ఏవో పి జయంతి, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

ప్రధాన రహదారులపై కూలిన భారీ వృక్షాలు

రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి మారేడుమిల్లి : వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మారేడుమిల్లి- రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలోని దేవరపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఉదయం భారీ వృక్షం రహదారిపై అడ్డంగా కూలింది. దీంతో ఇరువైపులా భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనాదారులు వర్షంలో రోడ్డుపై పడిగాపులు పడ్డారు. మూడు గంటలు అనంతరం స్థానికులు, ఆర్ అండ్‌బి సిబ్బంది చెట్టును తొలగించడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి.

సీలేరు : జీకే.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధి గుమ్మిరేవుల -వర్తండపాడు వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి ఓ భారీ వృక్షం కూకటవేళ్లతో కూలిపోయింది. దీంతో రాకపోకలకు బుధవారం ఉదయం వరకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆర్ అండ్ బి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో గిరిజనులే ఈ భారీ వృక్షాన్ని తొలగించారు. దీంతో రాకపోకలు సాగడంతో వాహన చోదకులు నర్సీపట్నం-గుమ్మిరేవులు బస్ సర్వీస్‌లో ప్రయాణించే ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న దేవరపల్లి గిరిజనులు

గ్రిడ్ ఆదేశాల మేరకు విద్యుదుత్పత్తి

ప్రజాశక్తి- సీలేరు : విజయవాడ విద్యుత్ సౌదా గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో రోజుకి 5 నుంచి 6 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని పేర్కొన్నారు. డొంకరాయి పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, ఒక్క సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మాత్రమే ఒకటో యూనిట్ మరమ్మతు పనులు జరుగుతున్నాయని, రెండు, నాలుగు, యూనిట్లులో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని, దీని కారణంగా ఈ యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి జరగలేదని తెలిపారు. యూనిట్లలో సాంకేతిక సమస్యలను సరిచేసి యూనిట్లు అందుబాటులో తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెన్‌కో సిఇ వాసుదేవరావు

ఉత్తలూరులో ఉచిత వైద్య శిబిరం

రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -మారేడుమిల్లి :రాజమహేంద్రవరం ఆర్ఎస్ స్వేచ్ఛ సోసైటీ డైరక్టర్ డాక్టర్ కే.స్వాతి ఆద్వర్యంలో రోటరీ క్లబ్ సహకారంతో మండలంలోని జిఎం.వలస పంచాయితీ పరిధి ఉత్తలూరు గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు సుమార్ 150 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్స్, గ్రామస్తులకు చార్జింగ్ లైట్స్, బట్టలు, దుప్పట్లు, పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డైరక్టర్ స్వాతి మాట్లాడుతూ ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, పాఠశాల భవనం కారిపోతుందని, నూతన భవనం ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నరసింహ రావు, పాఠశాల ఉపాధ్యాయులు పెంటా రెడ్డి, రాజన్న దొర తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని కణమాం, వెంకటాపురం, గొట్టిపల్లి, గిడిజాల తదితర గ్రామాలలో కేంద్ర జల జీవన్ మిషన్ బందం పర్యటించి, పథకాలను పరిశీలించింది. జలజీవన్ మిషన్, పారిశుధ్యవిభాగాలకు చెందిన కేంద్రబృందం ప్రతినిధులు ఘజాన్ఫర్ అహ్మద్, మాత్యూ జార్జ్, ఇతర సభ్యులు ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశమై ఇప్పటివరకు అమలు చేసిన జలజీవన్ మిషన్ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నీటినాణ్యత, నీటినిల్వలు, పారిశుధ్యం, స్వచ్ఛభారత్ మిషన్ తదితర అంశాలపై పరిశీలించారు

కార్యక్రమంలో జెజెఎం జిల్లా ఇన్‌ఛార్జి స్వప్న, జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య, వైస్‌ఎంపిపి పాండ్రంకి శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు షినగం అప్పలరాజు, గంటా జగదీశ్, ఆబోతు అప్పల నాయుడు, ఎంపిటిసి దొంతల కనక రాజు, తాడివాడ శివకృష్ణ, ప్రశాంత్ కుమార్, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు, ఎంపిడిఒ నల్లారి అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి కె.రామా రావు, ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ దుర్గాంబ, ఎఇఇ ఎస్ఎస్ఆర్. మూర్తి, జల జీవన మిషన్ ఎస్‌బిఎం ఎ.తిరుమల రావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీరామమూర్తి, పి.రామారావు, చందక ఝాన్సీ పాల్గొన్నారు.